ఆత్మషట్కమ్

(ఆత్మపఞ్చకమ్, అద్వైతపఞ్చకమ్, నిర్వాణపఞ్చకమ్)

నాహం దేహో నేన్ద్రియాణ్యన్తరఙ్గః

నాహంకారః ప్రాణవర్గో న బుద్ధిః,

దారాపత్య క్షేత్ర విత్తాదిదూరః

సాక్షీ నిత్యః ప్రత్యగాత్మా శివోఽహమ్. 1

రజ్జ్వజ్ఞానాద్ భాతి రజ్జౌ యథాఽహిః

స్వాత్మాజ్ఞానాదాత్మనో జీవభావః,

ఆప్తోక్త్యాఽహిభ్రాన్తినాశే స రజ్జుః

జీవో నాహం దేశికోక్త్యా శివోఽహమ్, 2

మత్తోనాన్యత్ కించిదత్రాస్తి విశ్వం

సత్యం బాహ్యం వస్తుమాయోపక్లుప్తమ్,

ఆదర్శాన్తర్భాసమానస్య తుల్యం

మయ్యద్వైతే భాతి తస్మాచ్ఛివోఽహమ్.3

ఆభాతీదం విశ్వమాత్మన్యసత్యం

సత్యజ్ఞానానన్దరూపే విమోహాత్,

నిద్రామోహాత్ స్వప్నవత్ తన్న సత్యం

శుద్ధః పూర్ణో నిత్య ఏకః శివోఽహమ్. 4

నాహం జాతో న ప్రవృద్ధో న నష్టో

దేహస్యోక్తాః ప్రాకృతాః సర్వధర్మాః,

కర్తృ త్వాదిశ్చిన్మయస్యాస్తి నాహం

కారస్యైవ హ్యాత్మనో మే శివోఽహమ్. 5

నాహం దేహో జన్మమృత్యుః కుతో మే

నాహం ప్రాణో క్షుత్పిపాసా కుతో మే

నాహం చిత్తం శోకమోహౌ కుతో మే

నాహం కర్తా బన్ధమోక్షౌ కుతోమే. 6

ఇతి శ్రీశంకరభగవత్పూజ్యపాదవిరచిత ఆత్మషట్కమ్.

నేను శరీరము,ఇంద్రియములు,అంతరంగము (అనగా అహంకారము, పంచప్రాణములు మరియు బుద్ధి), పుత్ర, కళత్ర, క్షేత్ర, విత్తములు కాను. నేను సర్వసాక్షిని, నిత్యుడను, ప్రత్యక్కును శివస్వరూపుడనని తెలిసికొంటిని.

త్రాడు పాముగా గోచరించినట్లుగా స్వాత్మాజ్ఞానమువలననే జీవభావము కలుగుచున్నది. ఆప్తులైనవారి బోధవల్ల సర్పభ్రాంతితొలగి త్రాడు త్రాడుగా కనపడుచున్నది. ఈ మాదిరిగా సద్గురూపదేశము వల్ల నేను జీవుడనుకానని శివుడనని తెలుసుకొంటిని.

ఈ విశ్వములో నాకన్నభిన్నమైనదేది లేదు.బాహ్యవస్తువులు అద్దములో ప్రతిబింబితమైనట్లుగా, సత్యము మాయచే ఆవరించబడి అద్వైతరూపుడనగు నాయందు ప్రకాశించుచున్నది. కనుక నేనే శివుడను.

నిద్రయందు అజ్ఞానముచే స్వప్నవస్తువు నిజమైనదిగా కనిపించుచున్నది.సత్యజ్ఞానానందరూపుడనగు నాయందు అజ్ఞానప్రభావమువల్ల ఈ జగత్తు గోచరించుచున్నది. ఇది కేవలము మిథ్య. నేను నిత్యుడను,శుద్ధుడను, పూర్ణుడను, అద్వితీయుడను, శివస్వరూపుడను.

చావు, పుట్టుక, పెరుగుదల అనునవి నాకు లేవు. ఇవి ప్రకృతివలన ఏర్పడిన శారీరకధర్మములు మాత్రమే. చిన్మయుడనైన నాకు కర్తృత్వ భోక్తృత్వములు లేవు. ఇవి అహం వృత్తులు. నేను శివస్వరూపుడను.

నేను శరీరమునుకానప్పుడు జనన మరణములు నాకెందుకుంటాయి? నేను ప్రాణమును కానప్పుడు నాకు ఆకలిదప్పులెందుకుంటాయి? నేను చిత్తమునుకానప్పుడు శోకమోహములు నాకెందుకుంటాయి? నేను కర్తను కానప్పుడు నాకు బంధములేదు, మోక్షమూలేదు.

ఇది ఆత్మషట్కము

***